# పార్టీలు మారే నేతలకు బుద్ధి చెబుదాం

ఇందిరానగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

**కార్యకర్తల సమావేశంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్**

బంజారాహిల్స్, ఏప్రిల్ 10: వ్యక్తిగత స్వార్థాల కోసం పార్టీలు మారే నాయకులకు రానున్న ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో బీఆర్ఎస్ బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావును గెలిపించాలని కార్యకర్తలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల శ్రమతో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మూడు నెలల్లోనే కాంగ్రెస్‌లోకి మారడమే కాకుండా ఎంపీగా పోటీ చేయడం సిగ్గుచేటు అని అన్నారు. అలాంటి వ్యక్తులను ఓడించడం ద్వారా భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి పని చేయకుండా చూడవచ్చని పేర్కొన్నారు. నాయకులు వెళ్లినంత మాత్రాన బీఆర్ఎస్ బలహీనపడే పరిస్థితి లేదని, నిబద్ధత కలిగిన ఎంతో మంది కార్యకర్తలు కష్టపడి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పెరుక కిరణ్‌కుమార్, విష్ణునాయక్, శంకర్, జ్యోతి, దీపక్, రమణమ్మ, స్రవంతి, విక్కీ, వినయ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న 'మోహినీ భస్మాసుర' నాటకం

మోహినీ భస్మాసుర నాటకంలో ఓ సన్నివేశం

బంజారాహిల్స్, ఏప్రిల్ 10: ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో పొత్తూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది రంగస్థల నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం మోహినీ భస్మాసుర పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన ఉషోదయ నాట్య కళామండలి ఆధ్వర్యంలో భస్మాసురుడిగా నంది అవార్డు గ్రహీత మొగిలిపువ్వు వెంకటసుబ్బయ్య, నారదుడిగా అసోది అక్కడిరెడ్డి, శంకరుడిగా కేసన నాగేశ్వర్‌రావు, విష్ణుమూర్తిగా కొప్పారపు శ్రీనివాస్‌రావు అద్భుతమైన నటనతో కళాభిమానులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్థానికులు, కళాభిమానులు వచ్చి ఆసక్తిగా తిలకించారు. అంతకుముందు గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశంలో శ్రీకృష్ణుడిగా ఎం.రామలింగేశ్వరరావు, అర్జునుడిగా ఉప్పాల రాజేశ్వర్‌రావు తమ పద్యాలతో అదరగొట్టారు.

## యూసుఫ్‌గూడ ఏఎంఓహెచ్‌గా డాక్టర్ కవిత

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 10: యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్) గా డాక్టర్ కవిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఎంఓహెచ్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ కేఎస్ రవి జూబ్లీహిల్స్ 18వ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. కాగా నూతన ఏఎంఓహెచ్‌గా డాక్టర్ కవిత బాధ్యతలు స్వీకరించారు.

# రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు సిద్ధం

**● ఎస్పీఆర్‌హిల్స్ పర్యటనలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

కార్పొరేటర్లతో కలిసి ఎస్పీఆర్ హిల్స్‌లోని ఈద్గా మైదానంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 10: రంజాన్ ప్రార్థనలు ఘనంగా జరుపుకునేందుకు నగరంలో ఈద్గాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో రూ.9లక్షల జీహెచ్ఎంసీ నిధులతో ప్రార్థనలు జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేశారు. ఈద్గా మైదానాన్ని స్థానిక కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్‌తో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలు ఏ పండుగ జరుపుకున్నా జీహెచ్ఎంసీ నుంచే నిధులు కేటాయిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అన్నివర్గాల ప్రజలు వారి పండుగలు ఘనంగా జరుపుకునేందుకు ఆయా సందర్భాల్లో నిధులను వెచ్చిస్తామని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో ఈద్గా ఏర్పాట్లను మేయర్ పరిశీలించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనార్టీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 15న 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకావిష్కరణ

సమావేశంలో మాట్లాడుతున్న బాబీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 10: ఐక్య రాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ లక్ష్మి మురుదేశ్వర్ పురి రచించిన 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకాన్ని ఈ నెల 15న హోటల్ తాజ్‌కృష్ణలో ఆవిష్కరించనున్నట్లు ప్రభా ఖైతాన్ ఫౌండేషన్ ప్రతినిధి బాబీ కందారియా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సివిల్ సర్వీస్ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న లక్ష్మి ఇప్పటికే పలు పుస్తకాలు రచించారన్నారు. సమాజంలో స్ఫూర్తి రగిలించే ఆమె పుస్తకాల పరంపరలో భాగంగా 15న పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, ఢిల్లీ మాజీ లెఫ్టనెంట్ గవర్నర్ నజీబ్ జంగ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

## 15, 16 తేదీల్లో యువజనుల సమస్యలపై సదస్సు

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల15, 16 తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తెలిపారు. సదస్సు వాల్ పోస్టర్‌ను బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం వల్ల యువతపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సుకు యువత అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

# నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 10: వేసవిలో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి అన్నారు. బుధవారం నారాయణగూడలోని జల మండలి కార్యాలయంలో జీఎం రామకృష్ణ, మేనేజర్ మహేందర్‌రెడ్డికి కార్పొరేటర్ మహాలక్ష్మి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పురాతన పైపులైన్ల స్థానంలో నూతన పైపులైన్ నిర్మాణాలు చేపట్టేందుకు పనులు చేయాలని అన్నారు. బస్తీలు, కాలనీల్లో పాడైన పవర్ బోర్‌వెల్‌లను మరమ్మతులు చేయాలని కోరారు. జనార్దన్‌బాడ, విఠల్‌వాడి, లిబర్టీ, ముత్యాలబాగ్, బగ్గీఖాన ప్రాంతాల్లో మంచినీరు సరఫరా సక్రమంగా జరుగకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. జీఎం సానుకూలంగా స్పందించి లీకేజీ అవుతున్న పైప్‌లైన్లు, వాల్వ్‌లను మరమ్మతులు చేయిస్తున్నామని అన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్, అనీశ్ గంగపుత్ర, మల్లేశ్, జక్కి, శేఖర్, హితేశ్, జగదీశ్, అభిషేక్ పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే రంజిత్‌రెడ్డిని గెలిపిస్తాయని సీతారంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శంషాబాద్ మండలంలోని నర్కూడ, చౌదర్‌గూడ గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, ఎంపీటీసీ గౌతమిఅశోక్, విజయ, లింగమయ్య, లలిత్, శ్రీరాములు, తొంట అశోక్, గుంటి ప్రవీణ్‌కుమార్, నజీరోద్దీన్, సోగాకు మల్లేశ్, మునుగాల మహేశ్, జంగమయ్య, చౌదర్‌గూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవేందర్, మల్లేశ్‌యాదవ్, సబ్బు పాల్గొన్నారు.

## బొట్టుపెట్టి.. ఓటుహక్కు కోసం విన్నవించి

బంజారాహిల్స్ రోడ్ నం-12లోని శ్రీరాంనగర్‌లో ఓటుహక్కు వినియోగించుకోవాలని బొట్టుపెట్టి కోరుతున్న సిబ్బంది

బంజారాహిల్స్, ఏప్రిల్ 10: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులు పలు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కళాశాలలు, ప్రైవేటు సంస్థల్లో ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. తాజాగా బీఎల్‌వోలు, జీహెచ్ఎంసీ సిబ్బంది సంయుక్తంగా బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ప్రచారం చేస్తున్నారు. మహిళలకు బొట్టుపెట్టి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని పలు బస్తీల్లో సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

## ఎన్నికల విధులకు సమాయత్తం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్ఓ దశరథ్‌సింగ్ రాథోడ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం కావాలని జూబ్లీహిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్ సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వంద శాతం పోలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 32 మంది సెక్టోరియల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి పోస్టల్ ఓటింగ్, హోమ్ ఓటింగ్‌పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 10: యువత మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతోత్సవాల బ్రోచర్‌ను బుధవారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్‌లో మహనీయుల జయంతోత్సవ కమిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలను చేపట్టేందుకు కలిసికట్టుగా సాగడం అభినందనీయమని చెప్పారు. వేడుకలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానన్నారు. అనంతరం కమిటీ సభ్యులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గొల్కొండ రాజ్‌కుమార్, టీఆర్ శ్రీరాములు, పంబాల రాజు, పలుగుచెరువు మహేశ్, జాన్‌పాల్, గంగని అరుణ్ కుమార్, ప్రీతమ్‌రాజ్, రాజ్‌కుమార్, బచ్చల మహేశ్, బర్ల సుమన్, ఆదిరాల శ్రీనివాస్, జోగి శ్రీనివాస్, బలరాం, గుంటి రమేశ్, గోల్కొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులుగా మంచి పేరు తెచ్చుకోవాలి

సక్సెస్ సమావేశంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

అమీర్‌పేట్, ఏప్రిల్ 10: విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు భారత్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫారిన్ మెడిసిన్ గ్రాడ్యుయేట్ లైసెన్సింగ్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు బుధవారం అమీర్‌పేటలోని ఓ హోటల్ ఈ-వింగ్స్ సంస్థ ఆధ్వర్యంలో సక్సెస్ సమావేశం నిర్వహించారు. కిర్గిజ్‌లో వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు భారత్‌లో పూర్తి స్థాయి వైద్యులుగా రాణించేందుకు అవసరమైన ఎఫ్ఎంజీఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఇకపై అత్యుత్తమ వైద్యులుగా గుర్తింపు తెచ్చుకోవాలని ప్రొసియమ్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ జి.భానుప్రకాష్ సూచించారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌లో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, వైద్య రంగంలో రోజురోజుకు మారుతున్న విధానాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ప్రతి వైద్యుడు నిరంతరం విద్యార్థిలా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో అరైజ్ అకాడమీ డైరెక్టర్ ఖలీల్ అహ్మద్, వశిష్ట గ్రూప్ జీఎం వంశీచంద్ర, టీఆర్‌టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 10: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తూ వంద శాతం ఓటింగ్ నమోదుచేసేందుకు కృషి చేయాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ అర్బన్ కమ్యునిటీ డెవలప్‌మెంట్ యూసుఫ్‌గూడ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్‌రావు పేర్కొన్నారు. బుధవారం వెంగళరావునగర్ డివిజన్ శ్రీనివాసనగర్ కమ్యునిటీ హాల్‌లో స్లమ్ లెవల్ ఫెడరేషన్, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ సభ్యులకు 'స్వీప్' అవగాహన నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా మహిళా సంఘాల ప్రతినిధులు కీలక భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో కమ్యునిటీ ఆర్గనైజర్లు ప్రశాంత్, వెంకటయ్య, శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సనన్లు, టీఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న యూసీడీ డీపీఓ వెంకట కిషన్‌రావు

## పోలండ్‌లో ఉగాది వేడుకలు

ఉగాది వేడుకల్లో పాల్గొన్న తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 10: పోలండ్ తెలుగు అసోసియేషన్ (పోటా) అధ్యక్షుడు చంద్రభాను ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు రాజధాని వార్సాలోని పోలీస్ మ్యూజియం ప్రాంగణంలో ఉత్సాహంగా నిర్వహించారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన తెలుగు పౌరులు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. తెలుగుభాష గొప్పదనాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని గురించి తెలియజెప్పేలా నాటికలు, ఏకపాత్రాభినయం నిర్వహించారు. భారత రాయబారి నగ్మా మల్లిక్, పోటా సభ్యులు శశి కాట్రగడ్డ, రాజ్యలక్ష్మి, ఆశ, సందీప్, సురేశ్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## మూసి వేసిన రోడ్డును తెరిపించాలి

రోడ్డు మూసివేతపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బండ్లగూడ, ఏప్రిల్ 10: గంధంగూడ నుంచి వివిధ కాలనీలకు ఉన్న రోడ్డును కొందరూ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రెకులతో ప్రహరీ వేసి మూసి వేశారు. దీంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో బుధవారం స్థానికులందరూ కలిసి రోడ్డుపై బైటాయించి రోడ్డును తెరిపించాలని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఈ రోడ్డు గుండా తము రాకపోకలు కొనసాగిస్తునామని అన్నారు. రోడ్డును మూసివేస్తే తాము రాకపోకలు సాగించేంది ఎట్లా? అని ప్రశ్నించారు. అంతే కాకుండా ఇది గంధంగూడ సర్వే నంబర్ 51 పరిధిలోకి వస్తుందని అది ప్రభుత్వ స్థలమని పేర్కొన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి మూసి వేసిన రోడ్డును తెరిపించాలని గండిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## మజ్జిగ కేంద్రం ప్రారంభం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లిలో కొమ్మగంటి అంజమ్మరాములుగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కొడుకు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమ్మగంటి రాజుగౌడ్ సొంత ఖర్చుల తో ప్రజలకు మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి లో ప్రజలకు తాగునీటితో పాటు చల్లని మజ్జిగ అందిస్తున్నట్లు తెలిపారు. స్థానికులతో పాటు జాతీయ రహదారిలో ప్రయాణం చేసే ప్రతిఒక్కరూ మజ్జిగ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెదిరిపాటి ప్రవీణ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు అంజయ్యగౌడ్, బక్క రత్నం, ప్రసాద్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కమట శేఖర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, ఆశోక్‌గౌడ్, పెంటయ్య, దర్శన్‌గౌడ్, సురేందర్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, మహేశ్‌యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 'సాహితీ తపస్వి- శ్రీ పోలవరపు కోటేశ్వరరావు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

బంజారాహిల్స్,ఏప్రిల్ 10: అచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన 'సాహితీ తపస్వి- శ్రీ పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సర్వస్వం' పుస్తకం రెండో భాగాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు బుధవారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ.. సాహిత్యమే తపస్సుగా ముందుకు సాగిన కోటేశ్వరరావు జీవితంతో పాటు సాహిత్యం కూడా ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సాధారణంగా సాహితీవేత్తలు ఒకటిరెండు ప్రక్రియలకు మాత్రమే పరిమితం అవుతుంటారని, దానికి భిన్నంగా పోలవరపు కోటేశ్వరరావు కవిత్వం, నవల, నాటిక, సంగీతం, నృత్యం, యక్షగానం, వ్యాఖ్యానం, పరిశోధన తదితర అనేక ప్రక్రియల్లో తన ప్రావీణ్యతను చాటుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత యార్లగడ్డ, సినీనటుడు బ్రహ్మానందంతో పాటు పోలవరపు కోటేశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# తప్పకుండా ఓటు వేస్తానని ప్రతిజ్ఞ

నేను తప్పకుండా ఓటు వేస్తాను అని ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వీప్ నోడల్ అధికారి శరత్‌చంద్ర

బండ్లగూడ, ఏప్రిల్ 10: సమర్థవంతమైన పరిపాలన కోసం ప్రతిఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి శరత్‌చంద్ర పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలపై రాజేంద్రనగర్ సర్కిల్ జనప్రియలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వీప్ నోడల్ అధికారి శరత్‌చంద్ర, జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారి రాధారాణి 'మేము తప్పని సరిగా ఓటు వేస్తాం' అని ఓటర్లతో ప్రతిజ్ఞ చేసియించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఓటరుకు ఓటుపై అవగాహన కల్పించి ఓటు వేసేలా చూడాలని అన్నారు. దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రధాన్యత ఉందని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనప్రియ ఉటోపియా అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE : AT : CHEVELLA**
**O.S.No. 253 of 2023**

**Between:**
Smt. J. Aruna @ Sangeetha ...Plaintiff
**AND**
1. Mangali Mallesh S/o. Chandraiah
And 9 (Nine) others ...Defendants

**NOTICE**

To
1. Rajesh Agarwal, S/o. Bankatlal Agarwal, Aged 64 years, Occ: Business, R/o. H.No. 8-13-90/1, Shastripuram (V), Rajendranagar Mandal, R.R. District ...Defendant No. 4
2. Mohammed Ahmed Mujtaba, S/o. Mohammed Ghouse, Aged 39 years, Occ: Business, R/o. 17-1-182/B/24/A, Salar Nagar, Santoshnagar, Hyderabad. ...Defendant No. 5
3. Mohammed Shahed Ali, S/o. Mohd. Asad Ali, Aged 47 years, Occ: Business, R/o. H.No. 8-2-695/B, Road No. 12, Banjara Hills, Hyderabad. ...Defendant No. 6

Take notice that the above named plaintiff filed a suit for partition of agriculture land in respect of Survey No. 182/E, admeasuring Ac. 0-18 Gts., Survey No. 31/BD/3, admeasuring Ac. 0-12 Gts., Survey No. 100/AA, admeasuring Ac. 0-02 Gts., Survey No. 26/A and a residential house No.1-4-1/1, situated at Hythabad Village, Shabad Mandal, Ranga Reddy District.

The Hon'ble Court posted the above case to 23-04-2024 for your appearance.

Therefore, you are hereby informed to appear before the Hon'ble Court on 23-04-2024 at 10.30 AM in person or through Advocate, failing which the matter will be decided in exparte.

**"By order of Court"**
Sd/- **K.V. KONDAL RAO,** Advocate
Address: Sudarshan Enclave, Road No. 13, Alkaapuri Colony, SRK Puram, Saroornagar, Ranga Reddy District-500 102.